


# కరపత్రం

SINCE 2014

బుధవారం మార్చి 12 2025 సంపుటి :0 సంచిక : 149 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు: 4

## ప్రజా సమస్యలపై దూకుడుగా వెళ్లాలి: పార్టీ ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం



హైదరాబాద్: తెలంగాణలో బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన భారాస శాసనసభాపక్ష సమావేశం జరిగింది. అసెంబ్లీ, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. అప్పుల విషయంలో కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. భారీగా అప్పులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయట్లేదన్నారు. రైతు బంధు, సాగునీరు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు.

"హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి మూడోవంతు సమయం పూర్తయింది. ప్రభుత్వానికి సరిపడా సమయం ఇచ్చాం. అసెంబ్లీ, మండలిలో ప్రజల గొంతుకగా పనిచేయాలి. ప్రజల సమస్యలపై దూకుడుగా వెళ్లాలి. తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి. ప్రభుత్వం అవినీతి, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాడాలి. భారాసపై ప్రభుత్వ తప్పుడు నిందలను తిప్పి కొట్టాలి. రైతుల సమస్యలు, మంచినీటి కొరతపై సభలో పోరాడాలి.

బీసీ, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలి. గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్న తీరుపై ప్రశ్నించాలి. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. మహిళలకిచ్చిన హామీలను నెరవేర్చాలని కొట్లాడాలి. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఖరిని నిలదీయాలి. దళితబంధు నిలిపివేయడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. ప్రజల కష్టాలపై ఉభయ సభల్లో ప్రశ్నించాలి" అని పార్టీ నేతలకు కేసీఆర్ సూచించారు.

## ఎట్లుండె తెలంగాణ.. ఎట్లాయె తెలంగాణ..!



హైదరాబాద్ : కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమైపోతున్నది.. సాగుకు సరిపడా నీళ్లు లేక, విద్యుత్ కోతలతో అన్నదాత బోరున విలపిస్తున్నాడు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే రైతన్న తల్లడిల్లిపోతున్నాడు. ఏం చేయాలో దిక్కుతోచక కొందరు అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. మరికొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. అన్నదాతల సమస్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ పాలనలో నడి ఎండకాలంలోనూ చెరువులు మత్తల్లు దుంకాయని కేటీఆర్ గుర్తు చేశారు. నేడు అదే చెరువులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని మండిపడ్డారు. నాడు కాలువల నిండా నీళ్లతో ఏడాదికి రెండు పంటలు పండించుకునేందుకు కేసీఆర్ అండగా నిలిస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పడావుబెట్టి, నీళ్లను ఆంధ్రాకు వదిలి పంటలను ఎండబెడుతుందని ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్ హయాంలో సమయానికి రైతుబంధు, 24 గంటల ఉచిత కరంటు, సాగునీళ్లు, విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోళ్లతో రైతు కంటినిండా నిద్ర, కడుపు నిండా సంతోషంగా ఉన్నాడని కేటీఆర్ గుర్తు చేశారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా రాదు, సాగునీళ్లు ఇవ్వరు, కరంటు ఇవ్వరు, విత్తనాలు దొరకవు, ఎరువులు ఉండవు, అన్ని గండాలు దాటుకుని పంటలు పండిస్తే కొనుగోళ్లు ఉండవు అని కేటీఆర్ పేర్కొన్నారు.

కేసీఆర్ పాలనలో వ్యవసాయ అనుకూల విధానాలతో పండగలా వ్యవసాయం ఉండే అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాతపై కక్షగట్టి వ్యవసాయాన్ని ఆగంపట్టించారని మండిపడ్డారు. అలంపూర్ నుండి ఆదిలాబాద్ వరకు అశ్వారావుపేట నుండి జహీరాబాద్ వరకు వ్యవసాయం తిరోగమనంలో ఉందన్నారు. సాగునీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయ్.. రైతుల

## గ్రూప్-2 ఫలితాల్లో సత్తా చాటిన పురుష అభ్యర్థులు.. 32వ ర్యాంకులో మహిళా అభ్యర్థి




గ్రూప్ -2 ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. జనరల్ ర్యాంకుతో పాటు ఫైనల్ కీని విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ తెలిపింది. ఇక ఈ ఫలితాల్లో పురుష అభ్యర్థులు సత్తా చాటారు. టాప్ టెన్ ర్యాంకులతో పాటు 31వ ర్యాంకు వరకు పురుష అభ్యర్థులే ఉన్నారు. లక్కిరెడ్డి వినిషా రెడ్డికి 32వ ర్యాంకు వరించింది. వినిషారెడ్డికి 408 మార్కులు వచ్చాయి. టాప్ టెన్ అభ్యర్థుల్లో ఐదుగురు ఓసీలు కాగా, మిగతా ఐదుగురు బీసీ కేటగిరికి చెందిన అభ్యర్థులు ఉన్నారు. టాప్ 50లో ఇద్దరు ఎస్టీ అభ్యర్థులు ఉన్నారు.

టాప్ టెన్ అభ్యర్థుల జాబితా ఇదే..

నారు వెంకట హరవర్ధన్ (ఓసీ) (మల్టీజోన్ -1) %- 447.088
వడ్లకొండ సచిన్ (ఓసీ) (మల్టీజోన్ -1) - 444.754
బీ మనోహర్ రావు (బీసీ-డీ) (మల్టీజోన్ -2) - 439.344
శ్రీరామ్ మధు (బీసీ-బీ) (మల్టీజోన్ -2) - 438.972
చింతపల్లి ప్రీతమ్ రెడ్డి(ఓసీ) (మల్టీజోన్ -1) - 431.102
అఖిల్ ఎర్ర (ఓసీ) (మల్టీజోన్ -2) - 430.807
గొడ్డేటి అశోక్ (బీసీ-బీ) (మల్టీజోన్-1) - 425.842
చిమ్ముల రాజశేఖర్(ఓసీ) (మల్టీజోన్-2) - 423.933
మేకల ఉపేందర్ (బీసీ-డీ) (మల్టీజోన్-1) - 423.119
కరింగు నరేశ్(బీసీ-బీ) (మల్టీజోన్ -2) - 422.989

## రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణం: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని గడ్కరీ ఆదేశించారు.

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ (62 కి.మీ.) ప్రాజెక్టుపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు.




## నిరుద్యోగులకు కొత్త స్కీం..

### అర్హతను బట్టి రూ.3 లక్షలు.. మార్చి 15 నుంచి దరఖాస్తులు: భట్టి

**రాజీవ్ యువ వికాసం పథకం కోసం రూ.6 వేల కోట్లు కేటాయించి, 5 లక్షల నిరుద్యోగులకు ప్రయోజనం కల్పించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు.**

**సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రోత్సాహం కోసం ఈ పథకం ద్వారా అర్హులైన నిరుద్యోగులకు రూ.3 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నారు.**

**మార్చి 15 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుండగా, ప్రభుత్వ చిత్తశుద్ధితో విద్యార్థులు, నిరుద్యోగులకు సహాయంగా జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేసినట్లు తెలిపారు.**

**రూ.540 కోట్లతో ఐలమ్మ యూనివర్సిటీ నిర్మాణం కొనసాగుతున్నదని, తొలిచరణలో రూ.15.5 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.**



నిరుద్యోగుల కోసం కొత్త స్కీంను అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.6 వేల కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. 5 లక్షల మంది కోసం రూ.6 వేల కోట్లతో పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు భట్టి. సెల్ఫ్ ఎంప్లాయ్ మెంట్ కోసం ఈ కొత్త స్కీం ను తీసుకొస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. మార్చి 15 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. నిరుద్యోగుల అర్హతను బట్టి 3 లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయం చేస్తామని అన్నారు.

తెలంగాణలో విద్యార్థులు, నిరుద్యోగుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని డిప్యూటీ సీఎం అన్నారు. ఇప్పటికే జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని గుర్తు చేశారు. అదేవిధంగా సెల్ఫ్ ఎంప్లాయ్ మెంట్ నుకూడా ప్రోత్సహించేందుకే ఈ కొత్త స్కీం తీసుకొస్తున్నట్లు తెలిపారు.

రూ.540 కోట్లతో ఐలమ్మ యూనివర్సిటీ నిర్మాణాలు పూర్తి చేస్తామని, అందులో భాగంగా మొదట 15.5 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు భట్టి. తమ ప్రభుత్వం కార్పోరేషన్ల ద్వారా నిరుద్యోగులకు, యువతకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తోందని, గత ప్రభుత్వం కార్పోరేషన్లను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు.

## గండిపేటలో కారు బీభత్సం.. ఇంజినీరింగ్ విద్యార్థి మృతి, ఐదుగురికి తీవ్రగాయాలు



నగర శివారులోని గండిపేట మూవీ టవర్స్ వద్ద మంగళవారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న శ్రీకర్ అక్కడికక్కడే మృతి చెందగా, హేమసాయి, వివేక్, సుజన్, కార్తికేయ, హర్షకు తీవ్ర గాయాలయ్యాయి.

ఎంజీఐటీ కాలేజీ ఇంజినీరింగ్ విద్యార్థులు ఆరుగురు కారులో నార్సింగి నుంచి నియోపొలిస్ వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. వేగంగా స్తంభాన్ని ఢీకొట్టడంతో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. క్షతగాత్రులను సమీపంలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీలపై కర్ణాటక అసెంబ్లీలో చర్చ



బెంగళూరు: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలపై మంగళవారం కర్ణాటక అసెంబ్లీలో చర్చ జరిగింది. కర్ణాటక ప్రభుత్వం తమ 5 గ్యారంటీల అమలు కోసం ఏర్పాటు చేసిన సమితుల్లో కాంగ్రెస్ కార్యకర్తలను అధ్యక్షులుగా నియమించి వారికీ కేబినెట్ హోదా కల్పించడంపై విపక్షాలు మండిపడ్డాయి. ప్రభుత్వ పథకాల అమలు పర్యవేక్షణకు స్థానిక ఎమ్మెల్యేలను నియమించకుండా, పార్టీ సభ్యుల కోసం కోట్లను ఖర్చు చేస్తున్నట్లు భాజపా సభ్యుడు ఎంపీ కృష్ణప్ప ఆరోపించారు. ఈ సందర్భంగా విపక్ష నేత ఆర్.అశోక్ కలగచేసుకుని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను సభలో ప్రస్తావించారు.

'గ్యారంటీల అమలుకు డబ్బు సమాకూర్చటం ఎంత సవాలో తాను సీఎం అయిన తర్వాతే తెలిసొచ్చిందని, మీ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే స్వయంగా వ్యాఖ్యానించారు. ఏటా రూ.18వేల కోట్లు పింఛన్లు, వేతనాలకు చెల్లిస్తూ గ్యారంటీల వ్యయాన్ని మోయటం భారమని ఒప్పుకొన్నారు.

## మాది ఫామ్ హౌస్ లో పడుకునే ప్రభుత్వం కాదు.. ప్రజా ప్రభుత్వం: మంత్రి పొంగులేటి




## అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదు: సుంకాల తగ్గింపుపై కేంద్రం




అమెరికా ఉత్పత్తులపై సుంకాల తగ్గింపునకు తాము ఎలాంటి హామీ ఇవ్వలేదని భారత ప్రభుత్వం స్పష్టంచేసింది.

అమెరికాపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించిందని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా భారత ప్రభుత్వం నుంచి స్పందన వచ్చింది. సుంకాల తగ్గింపునకు ఎలాంటి హామీ ఇవ్వలేదని స్పష్టం చేసింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం మార్చి 12 2025

# సంపాదకీయం

## అమెరికాను యూరప్ ధిక్కరించగలదా?

వైట్ హౌజ్‌లో అమెరికా అధ్యక్షుడు చర్చలకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడిని అవమానించిన రోజున (28, ఫిబ్రవరి) నేను ప్రముఖ సాహిత్య పత్రిక గ్రంట పాత సంచిక నొకదాన్ని చదువుతున్నాను. 1990 వసంతకాలంలో ప్రచురితమైన ఆ సంచిక ఇతివృత్తం 'కొత్త యూరప్!'. కొత్త అనే విశేషణం, ఆశ్చర్యార్థ సూచకం రెండూ కిందటి సంవత్సరం (1989)లో సంభవించిన చరిత్రాత్మక ఘటనలకు అంగీకారం తెలుపుతున్నవే. బెర్లిన్ గోడ పతనం, దశాబ్దాల అనంతరం పోలండ్లో ప్రప్రథమంగా స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగడం, తూర్పు యూరోపియన్ దేశాలలో నియంతృత్వ వ్యవస్థలు కుప్ప కూలిపోవడం మొదలైన నవ యుగ నిర్మాణ పరిణామాలు ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన సందర్భమది.ఆ సంఘటనలు యూరప్ భవిష్యత్తును ఏ విధంగా ప్రభావితం చేయనున్నాయనే విషయమై గ్రంట ఎడిటర్ విఖ్యాత యూరోపియన్ రచయితలు, మేధావుల నుంచి వ్యాసాలను ఆహ్వానించాడు. సహజంగానే ఆ వ్యాసకర్తలలో చాలా మంది గత కొద్ది నెలలుగా యూరప్‌లో చోటు చేసుకుంటున్న ఘటనల పట్ల తమ ఎనలేని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వారిలో ఒకరైన తూర్పు జర్మనీ మత గురువు వెర్నర్ క్రాట్ షెల్ బెర్లిన్ గోడ పతనానికి దారితీసిన 'స్వేచ్ఛ, గౌరవం కోసం పోరాటం'కు అభివందనాలు తెలిపారు. గ్రంట వ్యాస రచయితలలో ఒకరు రాజనీతి శాస్త్రవేత్త ఇసయ్యా బెర్లిన్. పాశ్చాత్య మేధో ప్రపంచంలో ఆయన మిగతా వ్యాసకర్తలు అందరికంటే విఖ్యాతుడు. అక్టోబర్ విప్లవ పూర్వపు రష్యాలో జన్మించిన బెర్లిన్ చిన్నవయసులోనే తన తల్లిదండ్రులతో ఇంగ్లాండ్‌కు వలస వచ్చాడు. తనవైన చింతనా పద్ధతుల్లో బ్రిటిష్ మేధో సంస్కృతికి వారసుడుగా వెలుగొందారు. ఆక్స్‌ఫర్డ్‌లో ఆచార్యుడుగా సుప్రసిద్ధమయ్యాడు. ఒక కొత్త ఆక్స్‌ఫర్డ్ కళాశాలను కూడా నెలకొల్పాడు. బ్రిటిష్ అకాడెమీకి అధ్యక్షుడు అయ్యాడు. ముమ్మూర్తులా బ్రిటిష్‌వాడుగా రూపొందినప్పటికీ రష్యా చరిత్రలో తన ప్రగాఢ కుతూహలాన్ని, గత కాలం రష్యన్ రచయితలు, చింతకుల పట్ల అపురూపమైన ఆసక్తిని తుదకంటా నిలుపుకున్న యూరోపియన్ మేధావి. రష్యాలో కమ్యూనిస్టుల పాలన అణచివేసిన పాతకాలం బుద్ధిజీవుల మేధో కృషి, ఉదారవాద సంప్రదాయాల పునరుద్ధరణకు 1989 ఘటనలు అవకాశం కల్పించాయని బెర్లిన్ పేర్కొన్నారు.తూర్పు యూరప్‌లో సోవియట్ కీలుబొమ్మల ప్రభుత్వాలు కూలిపోవడాన్ని మిగతా వ్యాసకర్తలూ స్వాగతించారు. అయితే భవిష్యత్తు పట్ల నిండు ఆశాభావాన్ని వ్యక్తం చేయలేదు, పలు సంవత్సరాలుగా కెనడాలో నివసిస్తున్న చెక్ రచయిత జొసెఫ్ స్కొవొరెస్కీ ఇలా రాశారు: 'ఐరోపాలోని వివిధ దేశాలలో నిరంకుశ ప్రభుత్వాలకు రోజులు చెల్లిపోయాయి. మరికొన్ని దేశాలలో వాటి అంతం ఆరంభమయింది'. బహుముఖ ప్రజ్ఞాశాలి జార్జి స్టెయినెర్ ఇలా వ్యాఖ్యానించాడు: మనం ప్రతిచోటా పునరుజ్జీవ జాతీయవాదం, జాతి విద్వేషాల మధ్య ఒక ఉన్మాద పోటీని చూస్తున్నాము. అయితే అమెరికా మాత్రం ఒక ప్రాంతీయ మహాశక్తిగా పరిణమిస్తున్నట్టుగా కనిపిస్తోంది. యూరప్ గురించి తెలుసుకోవడం లేదు. సంభవిస్తున్న సంఘటనలను పట్టించుకోకుండా ఈ మహా గొప్ప పాత ప్రపంచం (యూరప్) పట్ల ఉదాసీనత చూపుతున్నది. ఏమైనా యూరప్ పునరుత్థానమవుతోంది. తన సొంతంగా నిలబడుతోంది'.

1989 సంఘటనలలో సంభవించినదేమిటి? తూర్పు యూరప్ అంతటా అణచివేతకు గురైన జాతీయవాద మనోభావాలు ఉప్పెనలా వ్యక్తమయ్యాయి. పోలిష్ ప్రజలు, చెక్ దేశ వాసులు, మగ్యార్లు, జర్మన్లు సోవియట్ యూనియన్ ఆధిపత్యంపై తిరుగుబాటు చేశారు. సోవియట్ రష్యా శృంఖలాల నుంచి విముక్తమయ్యేందుకు దృఢంగా సంకల్పించుకున్నారు. పర్యవసానమే కొత్త యూరప్ ఆవిర్భావం. తూర్పు యూరప్ లోని చిన్న చిన్న దేశాలు మళ్లీ స్వేచ్ఛ సాధించుకోవడం పట్ల పలువురు వ్యాసకర్తలు తమ దృష్టి కేంద్రీకరించగా అంద్రేయి సిన్యావస్కీ అనే వ్యాసకర్త మాత్రం జాతీయవాదం అణగారిన ప్రజలను విముక్తం చేయడమే కాకుండా ప్రతి ఘాతుక శక్తిగా కూడా పరిణమించగలదని హెచ్చరించారు. 'ప్రతిఘాతుక శక్తి' అనే వ్యాఖ్యను ఆయన రష్యాను దృష్టిలో ఉంచుకుని చేశారు.ఒక ఇతివృత్తంతో వెలువరించే ఏ సంచిక కోసమైనా సంబంధిత పత్రిక ఎడిటర్ వ్యాసకర్తలకు వేర్వేరుగా లేఖలు రాయడం పరిపాటి. ???బెర్లిన్, సిన్యావస్కీలు ఇద్దరికీ తోటి వ్యాసకర్త ఏమి చెప్పుతున్నాడన్న విషయం తెలిసి ఉండే అవకాశం లేదు. ప్రచురితమైన మూడు దశాబ్దాల అనంతరం వారి వ్యాసాలను వెంటవెంటనే చదువుతున్నప్పుడు ఒకరి ఆశాభావం, మరొకరి సంశయవాదం మధ్య వైరుధ్యం స్పష్టంగా కన్పించింది. ఇందుకు కారణం వారి జీవిత ప్రస్థానాలు భిన్న రీతులలో సాగడమేనని చెప్పవచ్చు. రష్యాలో రష్యన్లతో నేరుగా సంబంధాలు లేని తాత్త్వికుడు బెర్లిన్. రష్యన్లతో ప్రత్యక్ష అనుభవాలు అపారంగా ఉన్న మేధావి సిన్యావస్కీ. 1925లో మాస్కోలో జన్మించిన సిన్యావస్కీ, 1973లో మాత్రమే సోవియట్ యూనియన్ నుంచి వలస పోయిన వ్యక్తి. కనుక ఆయనకు రష్యన్లతో దశాబ్దాల పాటు ప్రత్యక్ష అనుభవాలు ఉన్నాయి. రష్యన్ జాతీయవాదంలో విదేశీయుల పట్ల ద్వేషం దురహంకార ధోరణులు ఎలా ఉంటాయో ఆయనకు బాగా తెలిసి ఉంటుంది.తమ మాతృభూమి రష్యా విషయంలో మాత్రం బెర్లిన్ అభిప్రాయాల కంటే సిన్యావస్కీ అభిప్రాయాలే నిర్దుష్టంగా, యథార్థంగా ఉన్నాయని చెప్పవచ్చు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న వ్లాదిమిర్ పుతిన్ తొలుత తన సొంత ప్రజలను తన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా దాస్యులను చేసుకోగలిగాడు. ఆ తరువాత, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైపోయిన తరువాత స్వేచ్ఛ పొందిన దేశాల ప్రజలపై రష్యా సంపూర్ణ పెత్తనాన్ని నెలకొల్పేందుకు పూనుకున్నాడు. పుతిన్‌లో బలంగా ఉన్న సామ్రాజ్య పునర్నిర్మాణ ఆకాంక్షే ఉక్రెయిన్ దురాక్రమణగా రూపుదాల్చింది. ఉక్రెయిన్‌ను జయించిన పిదప మరికొన్ని చిన్న యూరోపియన్ దేశాలను సైతం ఆక్రమించుకునేందుకు ఆయన తప్పక ప్రయత్నిస్తాడు. రష్యన్ జాతీయవాద దురహంకార ధోరణులను, పుతిన్ విస్తరణవాదాన్ని విమర్శిస్తున్నవారు రష్యా భీతితో వ్యవహరిస్తున్నవారుగా పుతిన్ సమర్థకులు కొట్టివేస్తున్నారు.అమెరికా భవిష్యత్తులో యూరప్ పట్ల పూర్తిగా ఉదాసీనత చూపుతుందని జార్జి స్టెయినర్ చేసిన వ్యాఖ్యలు చాల దూరదృష్టితో చేసినవని గత పక్షం రోజులుగా సంభవిస్తున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. అమెరికా కాలక్రమేణా ఐరోపాపట్ల పూర్తిగా ఉదాసీనత చూపుతుందనేది ఆయన వ్యాఖ్యల సారాంశం కదా. పుతిన్ పట్ల డొనాల్డ్ ట్రంప్ అభిమానం అందరికీ తెలిసిందే అయినా, రెండోసారి అధికారానికి వచ్చీ రాగానే ఉక్రెయిన్ విషయంలో తీవ్ర వ్యతిరేకతతో వ్యవహరిస్తాడని కొద్ది మంది మాత్రమే ఊహించారు. ఫిబ్రవరి 28న వైట్ హౌజ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని ట్రంప్, ఆయన ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ మీడియా ముందే అంతగా అవమానించడాన్ని రష్యన్ రాజకీయవేత్తలు సహజంగానే స్వాగతించారు. ఉక్రెయిన్‌ను మళ్లీ స్వాధీనం చేసుకోవాలన్న తమ ఆకాంక్షను ట్రంప్ సమర్థిస్తున్నట్టు ఆ ఘటన నిర్ధారించిందని వారు ఆనందపడుతున్నారు.

### అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదు:

## సుంకాల తగ్గింపుపై కేంద్రం

మొదటిపేజీ తరువాయి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి మిత్రులు, శత్రువులు అని తేడా లేకుండా పలు దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. భారత్ తమ వస్తువులపై భారీగా సుంకాలు విధిస్తోందని ఆరోపించిన ఆయన.. వచ్చేనెల రెండో తేదీ నుంచి తమ ప్రతీకార సుంకాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇటీవల మరోసారి ఇదే అంశాన్ని ప్రస్తావించిన ట్రంప్.. భారత్ అత్యధికంగా సుంకాలు వసూలుచేస్తోందని, ఆ దేశంలో ఏ వస్తువు విక్రయించడానికి వీలులేనంత భారంగా ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని లేవనెత్తడం.. భారత్ చర్యలను తాము బహిరంగపరచడం వల్ల సుంకాలను తగ్గించడానికి ఆ దేశం అంగీకరించిందని తెలిపారు. దీనిపై తాజాగా భారత్ స్పందించింది.

"సుంకాల తగ్గింపు అంశంపై అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. అమెరికా అధ్యక్షుడు పదేపదే లేవనెత్తుతున్న ఈ సమస్య పరిష్కారానికి సెప్టెంబర్ వరకు సమయం కోరాం" అని పార్లమెంటరీ ప్యానెల్‌కు భారత ప్రభుత్వం వెల్లడించింది. ఈమేరకు జాతీయ మీడియా కథనం పేర్కొంది. భారత్– అమెరికా పరస్పరం ప్రయోజనకరమైన ద్వైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకొనే దిశగా కృషి చేస్తున్నాయని, తక్షణం సుంకాల సర్దుబాటు చేసుకునే బదులు దీర్ఘకాలిక వాణిజ్య సహకారంపై దృష్టిసారించాయని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి వెల్లడించారు. ట్రంప్ పాలన, భారత్‌పై సుంకాలు తదితర అంశాలపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల స్పందించిన సంగతి తెలిసిందే. "ప్రపంచంలోని శక్తిమంతమైన దేశాలన్నింటికీ సమాన అధికారాలు ఉండాలనే విధానంలో ట్రంప్ పాలన సాగుతోంది. అది భారత ఆలోచనలకు సరిగ్గా సరిపోతుంది" అని పేర్కొన్నారు.

## మాది ఫామ్ హౌస్ లో పడుకునే ప్రభుత్వం కాదు.. ప్రజా ప్రభుత్వం: మంత్రి పొంగులేటి

ఖమ్మం: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా మాది ఫామ్‌హౌస్‌లో పడుకునే ప్రభుత్వం కాదని.. ప్రజా ప్రభుత్వమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం (మార్చి 11) ఖమ్మం జిల్లా వైరా మండల పరిధిలోని పుణ్యపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ చేసిన ఏడు లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ.. అప్పులు తీరుస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళుతున్నామన్నారు. 56 నియోజకవర్గాలలో రెండు కోట్ల రూపాయల ఖర్చుతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా రైతు భరోసా, రైతు రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వమన్నారు. ప్రతిపక్ష నాయకులు అధికార పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ, పోలీస్ యంత్రాంగంపై ఉందని చెప్పారు. ఇసుక తరలింపుపై అభ్యంతరాలు పెట్టి లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు సూచించారు. 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లు కూడా నిర్మాణం చేయలేదని.. ఎక్కడ చూసినా మొండి గోడలు, అసంపూర్తి నిర్మాణాలేనని విమర్శించారు. కానీ ఇందిరమ్మ రాజ్యంలో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని గర్వంగా చెప్పారు.

## బ్యూరోక్రాట్లకు ఆ అవకాశం ఇవ్వలేం : సుప్రీం కోర్టు




మహారాష్ట్రలో ఓ మహిళను గ్రామ సర్పంచిగా తిరిగి నియమిస్తూ గతంలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు సమర్థించింది.

గ్రామీణ ప్రజాస్వామ్యాన్ని నిరుత్సాహపరిచే అవకాశం ఉన్నతాధికారులకు ఇవ్వలేమని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా మహారాష్ట్రలో ఓ మహిళను గ్రామ సర్పంచిగా తిరిగి నియమిస్తూ గతంలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. పంచాయతీ ప్రతినిధులతో ఉన్నతాధికారులు అనుచితంగా ప్రవర్తించిన అనేక ఘటనలు ఇటీవల తమ దృష్టికి వచ్చాయని పేర్కొంది.

"ఎన్నికైన ప్రజాప్రతినిధులతో ఉన్నతాధికారులు అనుచితంగా ప్రవర్తించిన రెండు, మూడు కేసుల్లో మేం తీర్పులు ఇచ్చాం. మహారాష్ట్రలో ఇలా తరచూ జరుగుతోంది. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో అధికారులు ఉండాలి. గ్రామీణ స్థాయి ప్రజాస్వామ్యాన్ని నిరాశపరిచే అవకాశం బ్యూరోక్రాట్లకు ఇవ్వకూడదు" అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. కొన్ని సందర్భాల్లో ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు వేసేందుకు పాత కేసులను బయటకు తీసేందుకు యత్నిస్తున్నట్లు గుర్తించామని తెలిపింది.

రాయ్‌గఢ్ జిల్లా రోహా తాలుకాలోని ఐంఘఢ్ గ్రామ సర్పంచి కళావతి రాజేంద్ర కోకలేపై అనర్హత వేటు వేస్తున్నట్లు స్థానిక కలెక్టర్ గతేడాది ప్రకటించారు. అక్కడ కొత్తగా ఎన్నిక నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారి నియమించారు. ఈ కేసుపై విచారణ జరిపిన బాంబే హైకోర్టు కలెక్టర్ ఆదేశం చట్టవిరుద్ధమని పేర్కొంటూ జులై 7, 2024న తీర్పు వెలువరించింది. తాజాగా దీనిని సుప్రీం కూడా సమర్థించింది.

## జమ్మూ కశ్మీర్‌లో రెండు సంస్థలపై కేంద్రం నిషేధం




దిల్లీ: జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేస్తోన్న రెండు సంస్థలపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం – 1967 ప్రకారం ఆవామీ యాక్షన్ కమిటీ, జమ్మూకశ్మీర్ ఇత్తిహదుల్ ముస్లిమీన్ గ్రూపులను ఐదేళ్ల పాటు నిషేధిత సంస్థలుగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ రెండు వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసింది. అవామీ యాక్షన్ కమిటీ (ఏఏసీ)కి ఉమర్ ఫరూక్ నేతృత్వం వహిస్తుండగా.. జమ్మూ కశ్మీర్ ఇత్తిహదుల్ ముస్లిమీన్ (జేకేఐఎం) సంస్థను మస్రూర్ అబ్బాస్ అన్సారీ నడిపిస్తున్నారు.ఈ రెండు సంస్థలకు చెందిన సభ్యులు జమ్మూ కశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని రెచ్చగొట్టేలా.. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం, భారత వ్యతిరేక ప్రాచారంలో పాల్గొన్నంటున్నట్లు కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. దేశ సమగ్రత, సార్వభౌమాధికారం, భద్రతకు హాని కలిగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. అన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని ఈ రెండు సంస్థలపై ఐదేళ్ల పాటు నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

## రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణం: మంత్రి కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి

**రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) అనుమతులు రెండు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారు.**

**సంగారెడ్డి - భువనగిరి - చౌటుప్పల్ వరకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, 95% భూ సేకరణ పూర్తయిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.**

దిల్లీ: రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డు, హైవేల కోసం గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

"సంగారెడ్డి – భువనగిరి – చౌటుప్పల్ వరకు ఆర్‌ఆర్‌ఆర్ టెండర్ల పక్రియ పూర్తయింది. దాదాపు 95శాతం భూ సేకరణ కూడా పూర్తయింది. రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు" అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

## తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీలపై కర్ణాటక అసెంబ్లీలో చర్చ

మొదటిపేజీ తరువాయి

ఈ గ్యారంటీలపై జాతీయ స్థాయిలో చర్చ అవసరమని ఇటీవల ఓ మీడియా కాన్‌క్లేవ్‌లో సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. గ్యారంటీల అమలు కష్టమని పక్క రాష్ట్ర సీఎం అభిప్రాయపడుతుంటే, మీ (కర్ణాటక కాంగ్రెస్) కార్యకర్తలకు ఈ గ్యారంటీ అమలు పేరిట 5ఏళ్లలో రూ.50కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధం అయ్యారు' అని ఆర్.అశోక్ తీవ్రంగా విమర్శించారు.

మరో భాజపా సభ్యుడు ఎం.సతీశ్‌రెడ్డి కూడా ఆంధ్రప్రదేశ్‌లో గత వైకాపా ప్రభుత్వం వ్యవహరించిన తీరును గుర్తు చేశారు. సంక్షేమ పథకాల అమలుకు పార్టీ సభ్యులను నియమించి సర్కారు సొమ్మును గత వైసీపీ ప్రభుత్వం వృథా చేసిందని గుర్తు చేశారు. విపక్ష సభ్యుల వాదనలకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బదులిస్తూ సర్కారు పథకాలను లబ్ధిదారులకు చేర్చేందుకు పార్టీ కార్యకర్తలు సహకరిస్తే తప్పేమిటని ప్రశ్నించగా, డీసీఎం సమర్థనపై విపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో సభలో గందరగోళం నెలకొంది.

## సంచార జాతులకు డీఎన్టీ సర్టిఫికెట్లు జారీ చేయాలి.. ఎమ్మెల్సీ కవిత డిమాండ్



రాష్ట్రంలో సంచార జాతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సర్టిఫికెట్లు లేక పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ బొల్ల శివ శంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ సంచార జాతుల సంఘం కోల శ్రీనివాస్ మంగళవారం నాడు ఎమ్మెల్సీ కవితకు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను శాసన మండలిలో లేవనెత్తాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ%ా% సంచార జాతులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో సంచార జాతుల అభివృద్ధికి కృషి జరిగిందని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంచార జాతులకు డీఎన్టీ సర్టిఫికెట్లు జారీ చేయకపోవడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆయా పథకాల ప్రయోజనాలు అందడం లేదని, దాంతో వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డీనోటిఫైడ్ జాతుల ఆర్థిక సాధికారత పథకం (సీడ్) కింద ప్రయోజనాలు సంచార జాతులు కోల్పోతున్నారని తెలిపారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డీఎన్టీ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను మొదలు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఎత్తరి మారయ్య, ఆలకుంట్ల హరి, ఆర్వి మహేందర్ రాజమళ్ళ బాలకృష్ణ, డి నరేష్ కుమార్, అశోక్ కుమార్ యాదవ్, డి కుమారస్వామి ప్రవీణ్ వంజరా, గోపు సదానందం, శ్రీధర్ సాగర్, లంగం పాల్గొన్నారు

## చిల్లర వేషాలు మానుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటా.. కాంగ్రెస్ సోషల్ మీడియాకు ఆర్ఎస్పీ వార్నింగ్



**హైదరాబాద్ :**

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నా రాజకీయ భవిష్యత్‌పై గత రెండు రోజులుగా కాంగ్రెస్ సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ చిల్లర వేషాలు మానుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆర్ఎస్పీ హెచ్చరించారు.

నేను రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానో, ఏ వర్గాల భవిష్యత్ కోసం పనిచేయాల్నో నాకు క్లారిటీ ఉందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మీ లాగా పదవులకోసం ఢిల్లీకి మూటలు మోసే సంస్కృతి నాకు లేదు. అన్ని పైసలు కూడా నా దగ్గర లేవు. తెలంగాణలో తరతరాలుగా అణచివేతకు గురైన వర్గాల విముక్తికి కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ సరైన వేదిక అని బలంగా నమ్మి ముందుకు వెళ్తున్నానని పేర్కొన్నారు. రేపు బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చిన తరువాత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రోత్సాహంతో తెలంగాణ 2.0ను ఎలా సృష్టించాలన్న పనిలో బిజీగా ఉన్నానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

# తీన్మార్ మల్లన్న.. తెలంగాణ కేజ్రీవాల్ !

**శివప్రసాద్,మేనేజింగ్ ఎడిటర్**




రెండు తెలుగు రాష్ట్రాల్లో వాక్పటిమతో ఇద్దరు నాయకులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారు.ఒకరు శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు.ఇంకొకరు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు.వెంకయ్య నాయుడు గారిది సిద్ధాంత నిబద్ధత.కేసీఆర్ ది ప్రత్యేక రాష్ట్ర సాధన ధ్యేయం.ఇద్దరూ అలుపెరుగని నాయకులే.ఇద్దరూ తమ తమ లక్ష్యాలతో పయనించిన వారే..వీరిద్దరి లాగ ఒక సిద్ధాంతమంటూ లేని చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న అడ్డగోలుగా మాట్లాడడమే తన ఎదుగుదలకు హేతువుగా మార్చుకున్నాడు.ప్రముఖుడిని టార్గెట్ గా చేసి ప్రాముఖ్యత పెంచుకోవడం ఒక వ్యూహంగా మార్చుకుని తెలంగాణ లో "లొల్లి మల్లన్న" గా పేరు సంపాదించుకున్నాడు.వెంకయ్య నాయుడు ప్రాస, కేసీఆర్ భాష యాస జనాల్ని అలరించాయి.కానీ తీన్మార్ మల్లన్నకు సిద్ధాంతం, లక్ష్యం లేదు.కేసీఆర్ తీరును పాలనను విమర్శించడమే అతని కార్యక్రమం అదే అతనికి ఒక గుర్తింపును ఇచ్చింది.కానీ, విమర్శ సిద్ధాంతంగా పరిగణించబడదు అనే సత్యం తప్పకుండా అతనికి అర్థం అయ్యే సమయం వస్తుంది.కేసీఆర్ ను "బాతాల పోశెట్టి" అని సంబోధించి, ఎడా పెడా మాట్లాడి పాపులర్ అయ్యాడు.తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ చేసిన వాగ్దానాలను, పాలనలో ఆశించిన రీతిలో కనిపించక ప్రజల్లో అసంతృప్తి రేగిన విషయం అందరికీ తెలిసిందే.సరిగ్గా ఈ పాయింట్ లో తీన్మార్ మల్లన్న జర్నలిస్టు అవతారంలో కేసీఆర్ ను టార్గెట్ చేసి గొప్ప వాడిగా,దమ్మున్న వాడిగా ప్రచారంలోకి వచ్చాడు.మీడియా ద్వారా ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే నాయకుడిగా జనానికి కనిపించాడు.ఇంతవరకు ఓకే..ఇక, ఆపై మల్లన్న తన రాజకీయాకాంక్షలను మెల్లమెల్లగా బయటపెట్టుకుంటూ అధికార పదవులకు ఎదగాలని పని చెయ్యడం మొదలు పెట్టాడు.టివిలో మల్లన్న గా అవతారమెత్తి,తీన్మార్ ప్రోగ్రాం లో విశిష్ట రూపంలో జానపదుని ఆహార్యంలో జనాన్ని అలరించిన విషయం అందరికీ తెలుసు.రాజకీయ వ్యంగంతో మెల్ల మెల్లగా మల్లన్న ఒక ప్రత్యేక గుర్తింపు సాదించిన తీన్మార్ మల్లన్న ఉరఫ్ చింతపండు నవీన్ ఒక కొత్త ప్రవక్త అవతారం లో కనిపించాలని ఆరాట పడ్డాడు. తన యూ ట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజా సమస్యల ప్రస్తావనతో,పరిష్కార వేత్తగా కనిపించి, తన రాజకీయ అభిలాశను బహిరంగ పరచుకున్నాడు.ప్రభుత్వ వ్యతిరేక వైఖరికి ఐకాన్ గా నిలవాలని అనుకున్నాడు.ఈ క్రమంలో మల్లన్నపై ఎన్నో ఆరోపణలు కూడా వచ్చాయి.నమస్తే తెలంగాణ పత్రికలో తీన్మార్ మల్లన్న వ్యవహారాలపై, 4 ఆగస్టు 2021 రోజున ఒక వార్త సవివరంగా ప్రచురితమైంది.హైద్రాబాద్ లోని చిలకలగూడ పోలీస్ స్టేషన్‌లో 22 ఏప్రిల్ 2021 రోజున 41ఏ సి.ఆర్.పై.సి కింద నోటీసులు జారీ చేశారు. మల్లన్న పై క్రైం నంబర్ 197/2021లో ఐపీసీ సెక్షన్ 387, 504 కింద కేసు నమోదైంది.ఈ కేసుతో మల్లన్న వ్యక్తిత్వాన్ని కించపరచలేము. కానీ, అతని వ్యవహార శైలి, అతని నడక నడత మాత్రం ఖచ్చితంగా లెక్కించ బడుతుంది.2012,13 లో అవినీతి వ్యతిరేక పోరాటం ప్రారంభించిన శ్రీ అన్నా హజారే నిరాహార దీక్ష దేశాన్ని పట్టి కుదిపింది.ఒక సచ్ఛీలుడిగా పేరున్న అన్నా నాయకత్వాన్ని అన్ని రంగాల ప్రముఖులు ప్రశంసించారు,సమర్థించారు.ఆ ఉధృత ఉద్యమంలో అన్నా హజారే చంకలో దూరిన కేజ్రీవాల్ " ఎం ధర్మరాజు ఎమ్మెల్యే" సినిమాలో క్యారెక్టర్ లాగా వినయ విధేయతలు ప్రదర్శించిన కేజ్రీవాల్ ప్రజల దృష్టిని ఆకర్షించి, ఒక పార్టీని స్థాపించడం మన కళ్ళ ముందు కదలిన జ్ఞాపకం.ఒక సిద్ధాంతమంటూ లేని కేజ్రీవాల్ కేవలం అవినీతి వ్యతిరేక ఉద్యమం తో నీతి మంతుడిగా, సామాన్యుడిగా నటిస్తూ ఢిల్లీ ప్రజల్లో ప్రాచుర్యం పొందాడు.సామాన్యుని పార్టీ అంటూ హిందీ భాషలో " ఆం ఆద్మీ పార్టీ" పేరున స్వంత కుంపటి పెట్టి తన పాలనతో చేసిన అవినీతి విశ్వ రూపం అందరమూ చూసాము.ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో అధికారం సాధించి ప్రజా నమ్మకాన్ని వమ్ము చేసాడు.ఢిల్లీలో కేజ్రీవాల్ శాశ్వత పాలకుడిగా నిండు శాసన సభలో ప్రకటించుకున్నాడు.ప్రభుత్వ సొమ్ముతో అతడు కట్టుకున్న "గాజు మందిరం" చూసి అదే ఢిల్లీ ప్రజలు మొన్నటి ఎన్నికల్లో అతడిని,అతని పార్టీని ఓడించారు.కేవలం వాగాడంబరం తో లోకాన్ని మోసం చేయలేం.ఇక తెలంగాణకు వస్తే "తీన్మార్ మల్లన్న" కూడా మరో కేజ్రీవాల్ లాగా కనిపిస్తున్నాడు.ఒక సిద్ధాంతం లేదు, ఒక కార్యాచరణ లేదు, ఒక విశ్వాసం లేదు.మాటల గారడీతో అధికారం అందుకోవాలనే యావ మల్లన్నలో స్పష్టంగా కనిపిస్తున్నది.ఇది జనానికి అర్థం అయింది.శ్రీ వెంకయ్య నాయుడు,శ్రీ కేసీఆర్ లకు ఒక సిద్ధాంతం, ఒక కార్యాచరణ ఉన్నది.తీన్మార్ మల్లన్న లో కనిపించనిది ఇదే..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ను పొగిడి రాజకీయ లాభం పొందాలనుకున్నాడు మల్లన్న.యూ ట్యూబ్ ఛానల్ లో లొల్లి తప్ప ఇంకే ప్రత్యేకత లేని మల్లన్న ను కేసీఆర్ దగ్గరికి రానివ్వలేదు.ఆ నిరాశలో మల్లన్న కేసీఆర్ పై అమర్యాద భాష ఉపయోగించి ప్రభుత్వ వ్యతిరేక అభిప్రాయాన్ని వినిపించడం ప్రారంభించాడు.దానితో మల్లన్న ప్రభుత్వ దమన నీతికి బలయ్యాడు.మల్లన్న ఒంటరి వాడయ్యాడు.ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ తో కలిసి నడచిన కమ్యూనిస్టు ప్రజా సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, కమ్యూనిస్టు ప్రభావిత జర్నలిస్టులు మల్లన్నకు సానుభూతి చూపించడం తప్ప కాపాడలేక పోయారు.అప్పుడు బిజెపి పంచన చేరిన తీన్మార్ మల్లన్న కు తెలంగాణ బిజెపి నాయకులు అండగా నిలబడ్డారు. ఏకంగా ఢిల్లీలోని బిజెపి కేంద్ర కార్యాలయంలో బిజెపి పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. ఇది బీజేపీ సభ్యత్వ రశీదు కాదు, ఒక ఆయుధం అంటూ సినిమా డైలాగులు పలికాడు.కేసీఆర్ ప్రభుత్వ వ్యతిరేకత తీవ్ర స్థాయిలో చెలరేగిన ఆ సమయంలో బిజెపి కాంగ్రెస్ రాష్ట్రంలో దూసుకు పోతున్న సమయంలో కేసీఆర్ వెంట నడచిన కమ్యూనిస్టు వర్గాల ప్రభావంతో మల్లన్న కాంగ్రెస్ రాగం పాడడం మొదలు పెట్టాడు.ఒక సారి పట్టబద్రుల ఎం.ఎల్.సి గా ఇండిపెండెంట్ గా పోటీ చేసి ప్రభావవంతమైన పోటీ ఇచ్చాడు.దానితో మల్లన్న తనకు తాను ఒక గొప్ప నాయకుడినని భ్రమించడం ప్రారంభించాడు.ఎలాగైనా కేసీఆర్ ను ఓడించడమే లక్ష్యంగా పని చేస్తున్న బిజెపి కేసీఆర్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలడం ఇష్టం లేక రేవంత్ రెడ్డి కి సైడ్ ఇచ్చింది.పర్యవసానంగా తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరింది.ఆపై మల్లన్న కాంగ్రెస్ పార్టీలో చేరి ఎం.ఎల్.సి గా పోటీ చేసి గెలిచాడు.రేవంత్ రెడ్డి గెలవడానికి తనే కారణం అంటూ మల్లన్న ప్రకటించుకునే వరకు అతని అతిశయం పెరిగి పోయింది.కర్ణుని చావుకు లక్ష కారణాలు అన్నట్టు కేసీఆర్ ప్రభుత్వ ఓటమికి ఎన్నో కారణాలు,ఎన్నో కోణాలున్నాయి.కేసీఆర్ ను ఓటమి క్రెడిట్ మొత్తం తన ఖాతాలో వేసుకున్న మల్లన్న కాంగ్రెస్ పార్టీని కూడా లెక్క చేయకుండా ప్రవర్తించడం మొదలు పెట్టాడు.టిఆర్ఎస్, బిజెపి,కాంగ్రెస్ పార్టీలన్నీ తిరిగిన తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ నుండి కావాలని సస్పెండ్ అయ్యేలా చేసుకున్నాడు.ఇక ఓ ఐదారేళ్ళు తన రాజకీయ హోదాకు ఢోకా లేదని భావించిన తీన్మార్ మల్లన్న ఇప్పుడు బిసి రాగం అందుకున్నాడు.మోడీ,బిజెపి వ్యతిరేక శక్తులు ప్రతి రాష్ట్రంలో ఒక ప్రభావ వంతమైన వ్యక్తి కొరకు వెతుకుతూనే ఉంటాయి.కేజ్రీవాల్ ను అలాగే చూసిన అంతర్జాతీయ, దేశ అంతర్గత శక్తుల మద్దతు కొరకు ఎదురు చూస్తున్నాడు.కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వెంట నిలిచిన చైనా, అమెరికా, కమ్యూనిస్టు, క్రైస్తవ, అరబ్బు శక్తులు కేజ్రీవాల్ పై ప్రయోగాలు చేసాయి.ఒక దశలో కేసీఆర్ కూడా ఈ శక్తుల ప్రాపకం కొరకు పనిచేసిన విషయం రాజకీయ పరిశీలకులందరికీ తెలుసు.చైనా గొప్పదనాన్ని పొగిడిన కేసీఆర్,చివరికి బంగ్లాదేశ్ ఆర్థిక స్థితి భారత్ కంటే మెరుగు అని స్టేట్ మెంట్లు ఇచ్చాడు.ఈ అంతర్జాతీయ రాజకీయ ఎత్తుగడలు ఎప్పుడూ ఉంటాయి. జాతీయ శక్తుల బలం పెరిగితే ఈ కుట్రలు పనిచేయవు.
కేరళ నుండి కాశ్మీర్ వరకు, గుజరాత్ నుండి త్రిపుర మణిపూర్ వరకు ఈ కుట్రలు సాగుతుంటాయి.మన బలమే జీవితం, మన బలహీనతే మరణం అని చాటిన స్వామి వివేకానందుని సూక్తి ని జాతి ఒంట పట్టిచ్చుకున్నది.ఈ తీన్మార్ మల్లన్న రాజకీయ ఆకాంక్ష వెనుక ఉన్న ఆటను అందరూ గమనిస్తున్నారు.తెలంగాణలో బలంగా ఉన్న బిఆర్ఎస్, కాంగ్రెస్ ల తో పాటు బిజెపి కూడా విస్మరించవీలులేని బలమైన పార్టీగా ఎదిగింది.రాజకీయ అధికారం కొరకు పని చేసే బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ లు అమాయక పార్టీలు కాదు.తెలంగాణలో కేజ్రీవాల్ శైలి పనిచేయదు.మరో కేజ్రీవాల్ లాగా తాత్కాలిక అవకాశాల ఆసరాతో పనిచేయాలని అనుకుంటున్న మల్లన్న కోరిక ఫలించడం కష్టం.ఒక కేజ్రీవాల్, ఒక కేసీఆర్ తో దెబ్బతిన్న కాంగ్రెస్ గానీ, నిరంతర పోరాటంతో స్పష్టమైన దారి కలిగిన బిజెపి గానీ, కాంగ్రెస్ కే హ్యాండిచ్చిన కేసీఆర్ గానీ తీన్మార్ మల్లన్న పయనం సాగనివ్వవు.తెలంగాణలో ఒక కొత్త రాజకీయ సమీకరణతో పని చేస్తున్న బిజెపి ఇటు బిసిల, దళితుల విశ్వాసం పొందుతున్నది. బిసి కార్డు బిజెపి కి లాభించే అవకాశముందని కాంగ్రెస్ గమనించింది. బిజెపి ఎత్తుగడలను బహుశా కాంగ్రెస్ పసిగట్టి తీన్మార్ మల్లన్న ను ఉసిగొల్పి, రెడ్లను తిట్టించి, మల్లన్నను బిసిల హీరోగా ఫోకస్ చేసి,బిసిల ప్రతినిధిగా నిలబెట్టాలని,కాంగ్రెస్ మల్లన్న సస్పెన్షన్ నాటకం ఆడుతున్నదనే అభిప్రాయం కూడా బిజెపి అర్థం చేసుకున్నది. ఈ అంతర్నాటకం ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.ఇదొక పొలిటికల్ ట్విస్ట్ అనే రాజకీయ విశ్లేషణ కూడా చక్కర్లు కొడుతున్నది.ఈ రాజకీయ వైకుంఠపాళీలో తీన్మార్ మల్లన్న ఎన్ని నిచ్చెనలు ఎక్కినా, పెద్ద పాములు మింగి వేయడం జరిగి తీరుతుందని రాజకీయ పండితుల విశ్లేషణ.బిసి ఫీలింగ్ స్థానిక అంశాల ఆధారంగా పనిచేస్తుంది. బిసి ఒక వ్యవస్థీకృత రూపం తీసుకోవడం కష్టం.ఏతా వాతా మల్లన్న కు వ్యక్తిగత లాభం తప్పితే,మల్లన్న వల్ల ఇంకేమీ జరగదని ఒక అంచనా.మల్లన్న కేసీఆర్ కాదు,వెంకయ్య నాయుడు కాదు..మల్లన్న భవిష్యత్తులో చివరికి చింతపండు నవీన్ గా మిగలడం ఖాయమని రాజకీయ పండితుల ఉవాచ.

# వేములకుర్తిలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

**- కొలిచినవారికి కొంగు బంగారంగా నిలుస్తున్న స్వామివారు**
**- రాతికట్టడాలతో అతి పురాతన ఆలయం గా ప్రసిద్ధి**
**- మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు**
**- జాతర ఏర్పాటు పనుల్లో ఆలయ కమిటీ సభ్యులు**

















దాదాపు ఐదు వందల సంవత్సరాల కాలం నాటి ఆలయాలలో ఒకటిగా వేములకుర్తి కి చెందిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఆలయం మొత్తం రాతితో కట్టబడింది. ఆలయ గర్భాలయం శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామివారి మూలవిరాట్ ముడు మీటర్ల పొడవు ఉంది. స్వామివారి కుడి భాగాన గోదాదేవి అమ్మవారు రెండు మీటర్లు, స్వామివారి ఎడమ భాగాన రామనుజులవారి రాతి విగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి.ఈ ఆలయంలో 12 మంది ఆళ్వారులు, సాలగ్రామాలు, గర్భాలయం పైన పద్మవ్యూహం తో రాతితో చెక్కబడిన కట్టడాలున్నాయి.వివరాల్లోకి వెళితే ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన అతి పురాతన ఆలయం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం. గోదావరి నది తీరాన ఈ ఆలయం ఉంది. ప్రతి సవత్సరం హెూలీ కి మూడు రోజుల ముందు నుండి. దేవాలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ గ్రామ ప్రజల సహాయ సహకారాలతో ఉత్సవాలు జరుగుతాయి. కొన్ని సంవత్సరాలుగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ యజ్ఞార్చకులు పూజ్య శ్రీ చక్రపాణి వాసుదేవాచార్యలు, పూజ్య శ్రీ చక్రపాణి నరసింహమూర్తి చార్యుల చేతుల మీదుగా ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, యజ్ఞము, ఆలయ బలిహరణం, కళ్యాణ మహెూత్సవ కార్యక్రమాలు జరుగుతాయి.ఆలయ అర్చకులు పూజ్యులు శ్రీ మంత్రరాజం శ్రీనివాస్ చార్యులు, పూజ్యులు శ్రీ మంత్రరాజం జానకి రామచార్యుల చే నిర్వహిస్తారు.ఈ ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం, యజ్ఞ మండపము, కళ్యాణ మండపము, తులసి కోట, శివపార్వతుల ప్రతిరూపమైన రావి,వేప,ఉసిరి చెట్లు భక్తుల పుజలు అందుకుంటున్నాయి. ఈ ఆలయానికి కోరిన కోరికలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెంది ఉమ్మడి కరీంనగర్ ,ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి బ్రహ్మోత్సవాలకు వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు.భక్తుల సౌకర్యార్థం మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసి భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజువారి కార్యక్రమాలు 12/03/2025 బుదవారం రోజు ఉదయం 8 గంటలకు ఆలయంలో గోదావరి జలాలతో అభిషేకాలు. అనంతరం నిత్యవిధి ఆరాధనం, స్వస్తి వాచనం, దేవతామూర్తుల స్థాపనలు, అగ్ని ప్రతిష్ట, హెూమము, ధ్వజారోహణం, గరుడపెల్లి, ఆలయ బలిహరణం అనంతరం నిథ్యవిది కార్యక్రమాలు 13 మార్చ్ గురువారం రోజు ఉదయం 8 గంటలకు ఆలయంలో గోదావరి జలాలతో అభిషేకాలు,స్వామి వారి మూలవిరాట్ కు పూలాభిషేకం అనంతరం నిత్యవిధి ఆరాధనం,స్వస్తి వాచనం, దేవతామూర్తుల స్థాపనలు, హెూమము, నిత్య పూర్ణాహుతి ,బలిహరణం అనంతరం ఆలయ నిత్యవిది కార్యక్రమాలు
14 మార్చ్ శుక్రవారం రోజు ఎనిమిది గంటలకు గోదావరి జలలు, పంచామృత అభిషేకాలు స్వామి వారికి నిర్వహించిన అనంతరం, నిత్యస్వస్తి వచనం ,యజ్ఞము పూర్ణాహుతి కార్యక్రమం అనంతరం వెంకటేశ్వరస్వామి అలివేలు మంగా పద్మావతి అమ్మవార్ల గ్రామ ప్రదక్షణ ఎదుర్కోలు మహెూత్సవం. అనంతరం కల్యాణ మండపంలో అలివేలు మంగమ్మ ,పద్మావతి శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి వారికి అర్చకులు చేతుల మీదుగా కళ్యాణం జరిపించబడుతుంది.అనతరం స్వామివారి భక్తులకు గ్రామ అభివృద్ధి కమిటీ, దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం, రాత్రికి స్వామివారి రథం గ్రామంలో ఊరేగింపు ప్రదక్షిణ, అనంతరం అర్చకులకు పండితులకు సన్మాన మహెూత్సవ కార్యక్రమం జరుగనుంది.గ్రామస్తుల సహకారంతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ బర్మా మల్లయ్య గారు కరపత్రం ప్రతినిధి తో అన్నారు.

# అక్రమ ఇసుక వేలం


**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**


శ్రీ ప్రసాద్, తహసిల్దార్. ఇబ్రాహింపట్నం, జగిత్యాల్ జిల్లా

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో అక్రమ రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు.అక్రమ రావానాడారులపై చట్టపరమైన చర్యలుంటాయని తహసిల్దార్ శ్రీ ప్రసాద్ గారు మీడియాకు తెలిపారు.పట్టుకున్న ఇసుకను వేలం వేస్తున్నట్లు ఇబ్రహింపట్నం తహశీల్దార్ శ్రీ ప్రసాద్ మంగళవారం తెలిపారు.గురువారం వేలం పాటలో ఆసక్తి గల వారు ముందు గా దరావత్తు చెల్లించి వేలం పాట లో పాల్గొనవచ్చునని తహసీల్దార్ పెర్కోన్నారు.ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాపై ఆంక్షలు విధించిందని, ఇసుక అక్రమ రవాణాను కఠినంగా అణచివేస్తామని తహసిల్దార్ అన్నారు.ఈ ఇసుక మాఫియాపై ప్రజలు సమాచారం అందించి సహరించాలని తహసిల్దార్ కోరారు.

# ఇన్స్పైర్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**



ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న ఇన్స్పైర్ అవార్డుల కార్యక్రమం లో భాగంగా 2024-2025 సంవత్సరం కొరకు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు మంగళవారం మండల విద్యాధికారి శ్రీ మధు గారు కరపత్రం కు తెలిపారు.మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన 7 వ తరగతి విద్యార్థి ముక్కెర రనూష, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇబ్రహీంపట్నం కు చెందిన 6వ తరగతి విద్యార్థి దుబ్బాక ప్రగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వర్షకొండ కు చెందిన 8 వ తరగతి విద్యార్థి ఆరెపెల్లి సాయి చందనలు వారి ఎగ్జిబిట్ లను గత సెప్టెంబర్ ఆన్లైన్లో పంపించగా, వీరి ఎగ్జిబిట్స్ ఉత్తమమైనవి గా ఎంపికచేసారని తెలిపారు. ఎంపికయిన ఒక్కో విద్యార్థికి రూ. 10 వేల చొప్పున బ్యాంకు ఖాతాలో వేయనున్నారు.ఈ నగదుతో గైడ్ టీచర్ మార్గదర్శకంలో ఎగ్జిబిట్స్ తయారుచేసి జిల్లా స్థాయిలో నిర్వహించే సైన్స్ ఫేర్ లో ప్రదర్శిస్తారని ఎం.ఈ.వో మధు తెలిపారు.

विज्ञान एवं प्रौद्योगिकी विभाग DEPARTMENT OF SCIENCE & TECHNOLOGY
inspire - manak
राष्ट्रीय नवप्रवर्तन प्रतिष्ठान – भारत
National Innovation Foundation - India

# మానకొండూర్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు రూ.200 కోట్లు మంజూరు...

## - ఎమ్మెల్యే కవ్వంపల్లి వెల్లడి....

**కరపత్రం శంకరపట్నం మార్చి 11**
యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని యాదవుల పల్లిలో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ప్రెసిడెంట్ స్కూలుతో సహా రాష్ట్రవ్యాప్తంగా 55 స్కూళ్లకు రూ.11,000 కోట్లు మంజూరు చేసింది.ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ ఉత్తర్వులు చేసినట్టుగా మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వెల్లడించారు.55 అసెంబ్లీ నియోజకవర్గా ల్లో ఏర్పాటు కానున్న సమీకృత గురుకులాల నిర్మాణం కోసం ఒక్కో స్కూల్ కి రూ. 200 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. నియోజకవర్గానికి ఒక్కొక్కటి చొప్పున మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 119 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా, ఇందులో తొలివిడతగా 55 నియోజక వర్గాల్లో గురుకులాల నిర్మాణం చేపట్టింది.



వీటిలో అడ్మినిస్ట్రేష్ బ్లాక్, అకాడమిక్ బ్లాక్, స్టాఫ్ క్వార్టర్స్, లైబ్రరీ, క్రీడా ప్రాంగణం, బాలురు, బాలికల హాస్టల్ బ్లాకులు నిర్మిస్థారు. బోధన్, బోధనేతర సిబ్బందికి కూడా కి నివాస సముదాయాలు ఇందులో ఉంటాయి.ఒక్కో భవనంతి నిర్మాణానికి రూ. 135 కోట్లు , ఇతరత్రా అవసరాలు, పన్నుల కోసం అదనంగా రూ.65కోట్లు వెరసి రూ.200 కోట్ల చొప్పున ప్రభుత్వం కేటాయించింది.నిధుల మంజూరుపై ఎమ్మెల్యే కవ్వంపల్లి హర్షం..మానకొండూర్ యాదవులపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 200 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు దసరా చర్యలు తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.గత ప్రభుత్వం పేద పిల్లలకు విద్యను దూరం చేసే ప్రయత్నం చేసిందని,రాష్ట్రంలో 5 వేల ప్రభుత్వ పాఠశాలలను మూతపడటం ఇందుకు నిదర్శనమని, ఎమ్మెల్యే సత్యనారాయణ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు నడుం బిగించిందని,అందులో భాగంగానే యంగ్ ఇండియా ఇండిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలు చేపట్టిందని ఎమ్మెల్యే సత్యనారాయణ అన్నారు.

# ఇన్స్పైర్ మానక్ అవార్డ్స్ అందుకున్న యూనివర్సల్ విద్యార్థులు:



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**




పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం గన్ శ్యామ్ దాస్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రముఖ పాఠశాల ఐఐటి ఫౌండేషన్ స్కూల్ విద్యార్థుల ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రభంజనం.డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్స్పైర్ మాన్ పోటీలలో భాగంగా స్మార్ట్ మెడిసిన్ రెమిడీల్ స్మార్ట్ కంపోస్ట్ బిన్ అనే అంశాలపై యూనివర్సల్ విద్యార్థులైన 9వ తరగతి విద్యార్థి ఎండి. అల్తాఫ్, పి.అక్షర 8వ తరగతి సిహెచ్ శ్రీ నిత్య, ఏడవ తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఎంఈఓ టి. విమల విద్యార్థులను ప్రశంసిస్తూ సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఎండి. ఇస్మాయిల్ ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అబ్జల్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులకు కూడా పాఠశాల ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.

# వాహనదారులకు ప్రాణాంతకంగా మారిన జమ్మికుంట ఫ్లైఓవర్ రోడ్డు డివైడర్లు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట**
జమ్మికుంట పట్టణంలో రైల్వే లైన్ వల్ల వాహనదారులకు ఇబ్బంది ఏర్పడుతున్నదని నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పైన ఏర్పాటుచేసిన సిమెంటు డివైడర్లు వాహనదారుల పట్ల ప్రాణాంతకంగా మారి, గత ఐదు సంవత్సరాలలో అనేకమంది మృత్యువాత పడ్డారు, ఎంతోమంది ఆసుపత్రులపాలై వికలాంగులుగా జీవితం గడుపుతున్నారు.జమ్మికుంట ఆర్ఓబి కొత్తపెల్లి హనుమాన్ జంక్షన్ నుంచి మొదలై బస్టాండ్ వరకు, మరోవైపు మోతుకులగూడెం వైపు విస్తరించి ఉంది .ఫ్లైఓవర్ పై సెంటర్లో ప్రమాదాల నివారణ గురించి ఏర్పాటు చేసిన సిమెంట్ డివైడర్లకు కనీసం రేడియం స్టిక్కర్ వేయకపోవడం ,ప్రమాదాలు జరుగు ప్రదేశాల కంటే ముందు ఏర్పాటుచేసే జాగ్రత్తలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయకపోవడం వల్ల చాలామంది ప్రాణాలు







కోల్పోయారు...బ్రిడ్జిపై మున్సిపల్ అధికారులు ఏర్పాటుచేసిన లైట్లు వెలుగుక పోవడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వల్ల వాహనదారులలో నియంత్రణ కోల్పోయి కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి.
తక్షణమే పోలీసు అధికారులు , మున్సిపల్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు తగు చర్యలు తీసుకొని ఈ ఆర్ఓబి పై కొత్తపల్లి హనుమాన్ జంక్షన్ నుండి జమ్మికుంట బస్టాండ్ వరకు ఆర్ ఓ బి సెంటర్ నుంచి మోతుకుల గూడెం వరకు ప్రమాదరహితమైన హైవే పై ఏర్పాటు చేసే ఎరుపు రంగు స్టాపర్లను ఏర్పాటు చేయడమే కాకుండా బ్రిడ్జి సెంటర్లో సిగ్నలింగ్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహన దారులు, పట్టణ వాసులు కోరుతున్నారు . తక్షణమే జిల్లా కలెక్టర్ మరియు పోలీస్ కమిషనర్, ఆర్ అండ్ బి సూపర్డెంట్ ఇంజనీర్ ఈ బ్రిడ్జిని సందర్శించి ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడవలసిందిగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# మృతుడి భార్యకు గాయత్రి బ్యాంక్ చెక్కు అందజేత..



## - చెక్క అందజేసిన ఎమ్మెల్యే...

**కరపత్రం శంకరపట్నం మార్చి 11**
రోడ్డు ప్రమాదంలో మరణించిన కరీంనగర్ గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడు కెన్నరసారం తిరుపతి సతీమణి వెంకటలక్ష్మికి లక్ష రూపాయల భీమా మొత్తాన్ని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. కేశవపట్నం గ్రామానికి చెందిన తిరుపతి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా, నామిని అయిన అతని భార్య వెంకటలక్ష్మికి ఎల్ఎండి కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి బ్యాంక్ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ గొట్టె అశోక్, సీనియర్ ఆఫీసర్ వేముల విష్ణువర్ధన్, జూనియర్ ఆఫీసర్ ఉల్లంగుల అనిల్, బ్యాంకు అడ్వకేట్ కొరిమి ప్రవీణ్ కుమార్, కేశవపట్నం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోడిశాల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం

**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చ్11.**
ఆర్జి-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గుర్తింపు సంఘం ప్రతినిధులతో మంగళవారం జి.యం.కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్యనారాయణ లతో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎం.రామచంద్రారెడ్డి,ఇతర సభ్యులు చర్చించారు.ఈ సమావేశంలో భాగంగా సెంటినరీ కాలనీలో గల క్వార్టర్స్ వెనుక భాగంలో శుభ్రపరచడం,జోన్-2 లో నీటి పైప్ లైన్ కొరకు తవ్విన గుంతలు పూడ్చి,నల్లా కనెక్షన్లు తిరిగి ఇవ్వడం,క్వార్టర్స్ కు సున్నం,రంగులు వేయించడం,వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్టీ-2 క్వార్టర్స్ పైభాగంలో మరమ్మతులు చేయించడం.అడ్రియాల లాంగ్ వాల్ గని ఉద్యోగులకు లాంగ్ బూట్లు ఇప్పించడం,లాకర్స్ సౌకర్యం కల్పించడం,అడ్రియాల లాంగ్ వాల్ గని లో క్యాప్ ల్యాంప్స్ విడిభాగాలను అందుబాటులో ఉంచడం,సబ్




స్టేషన్,ఫ్యాన్ హౌస్,ఫిల్టర్ బెడ్ లకు సెక్యూరిటి గార్డులను నియమించడం,ఓసిపి-2 లో గ్రేడర్స్,డోజర్స్ ను అందుబాటులో ఉంచడం,జి.యం కార్యాలయానికి వివిధ సేవల కోసం వస్తున్న విశ్రాంత ఉద్యోగుల కోసం విశ్రాంతి గది,మరుగు దొడ్లను నిర్మించడం,అడ్రియాల లాంగ్ వాల్ నుండి వకీల్ పల్లి గని రహదారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను తొలగించడం,వీధి దీపాలు ఏర్పాటు చేయడం,ఓసిపి-1,ఓసిపి-2 లో గత మూడు సంవత్సరాలకు సంబంధించి జనరల్ మజ్దూర్ (హెమ్),ఇ.పి. హెల్పర్,గ్రీజర్ పదోన్నతులు కల్పించడం,సెంటినరీ కాలనీలోని మార్కెట్ సెంటర్,తెలంగాణ సెంటర్ లలో బస్ షెల్టర్,మరుగుదొడ్లు నిర్మించడం లాంటి పది అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా జి.యం.లు మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.అదేవిధంగా కార్పొరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు జూపాక రాంచందర్,డి.తిరుపతి రావు,ఎస్.విజయ్ రాఘవ,భాస్కర రాజు, ఎస్వోటుజిఎం జి.రఘుపతి,ప్రాజెక్ట్ ఆఫీసర్లు సి.హెచ్.వెంకటరమణ,జె.రాజశేఖర్, విభాగాధిపతులు,అధికారులు కె.చంద్రశేఖర్, బి.సుదర్శనం,బి.రాజేంద్రకుమార్,యం.వి. ఎన్.ఎ.చంద్రశేఖర్,కె.వి.రామారావు,మతీన్ హుస్సేన్,పాల్గొన్నారు.

# రామగుండం నూతన సీపీ ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన బిజేపి నేతలు..!



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**



రామగుండం నూతన కమిషనర్గా పదవీ బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝా ని రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి కమిషనర్ కి పుష్పగుచ్ఛం అందించి,శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ....రామగుండం ప్రాంత అభివృద్ధికి, శాంతి భద్రతల పరిరక్షణకు సంపూర్ణ సహకారం అందిస్తామని, నగరంలో ప్రజాసమస్యల పరిష్కారంలో బీజేపీ పూర్తి సహకారం అందిస్తుందని కందుల సంధ్యారాణి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గాండ్ల ధర్మపురి,తోట కుమారస్వామి మరియు మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్ ,గుండబోయిన భూమయ్య,కోడూరి రమేష్,సిలువేరు అంజి పాల్గొని, కమిషనర్ కి శుభాకాంక్షలు తెలిపారు...

# పొలంబాటలో విద్యుత్ అధికారులు

## 100 కే.వి ట్రాన్స్ఫార్మర్ ను ప్రారంభించిన ఎస్.ఈ,డీ.ఈ

**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చ్11.**
రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో మంగళవారం ఎన్.పీ.డీ.సీ.ఎల్ విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు.పెద్దపల్లి జిల్లా ఎస్.ఈ కె. మాధవరావు మంథని డివిజన్ డీ.ఈ వి.ప్రభాకర్ పొలంబాటలో పాల్గొని,రైతులతో ముచ్చటించారు.ఓవర్ లోడ్ తగ్గించడానికి ఈ ప్రాంతంలో నూతన వంద కే.వి ట్రాన్స్ఫార్మర్ ను ఎస్.ఈ,డి.ఈ లు కలిసి ప్రారంభించారు.విద్యుత్ సమస్యల



పరిష్కారానికి,రైతులకు రక్షణ చర్యలను అధికారులు వివరించారు.ప్రతి రైతు తొందరపడి విద్యుత్ విషయంలో అజాగ్రత్తగా ఉండవద్దని వారు కోరారు.ముఖ్యంగా ఫ్యూజ్ పోయినప్పుడు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని,స్వతహాగా ఫ్యూజ్ వేసుకోవద్దని.సర్వీస్ వైర్ కు జాయింట్ ఉండవద్దని.నాణ్యతమైన కెపాసిటర్లు ఏర్పరచుకోవాలని.పీవీసీ బాక్స్ ఏర్పాటు చేసుకోవాలని.రైతులకు విద్యుత్ సమస్యలపై ఇబ్బందులు ఉంటే తమ ప్రాంతంలోని అధికారులకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ.డి.ఈ కనకయ్య,రామగిరి ఏ.ఈ కే.మహేందర్ రెడ్డి,సబ్ ఇంజనీర్ కే.సతీష్,సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ ఎస్ శ్రీనివాస్,లైన్ ఇన్స్పెక్టర్ ఏ నాగరాజు,లైన్ మెన్ లు ఏ శ్రీనివాస్,బి శివకుమార్, ఏ.ఎల్.ఎం లు రమేష్,ప్రభాకర్,అన్ మ్యాన్ లు జి చందు లక్ష్మణులు పాల్గొన్నారు.